క్లుప్తంగా

ఏపీటీలో ఓఎన్‌జీసీ సేవా కార్యక్రమం

బాలాజీచెరువు: ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఓఎన్‌జీసీ సంస్థ సామాజిక సేవాకార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటి అనంతరం శానిటరీ నాప్‌కిన్ దహనం చేసే పరికరాన్ని కళాశాల ఆవరణలో అమర్చారు. ఈ కార్యక్రమంలో ఏఐడబ్ల్యూసీ కాకినాడ కార్యదర్శి భానుమతి, వైస్ ప్రెసిడెంట్ మీనాక్షి, కోశాధికారి పద్మజ, కళాశాల ప్రిన్సిపాల్ నెల్లి జనార్దనరావు పాల్గొన్నారు.

డయల్ యువర్ కమిషనర్‌కు 11 ఫిర్యాదులు

కాకినాడ సిటీ: డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా 11 మంది కమిషనర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ కమిషన్ మనోహర్, ఎస్ఈ కామేశ్వరరావు, మేనేజర్ సత్యనారాయణ, ఏడీహెచ్ సిరిల్, టీపీఆర్వో శైలజ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అయ్యప్పస్వామి ఆలయంలో వేదాశీర్వాదం పొందుతున్న రాజ్యసభ సభ్యుడు సతీష్ తదితరులు

బోట్‌క్లబ్: రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కాకినాడ నగరానికి వచ్చిన సానా సతీష్ సోమవారం స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పుష్పాభిషేకం చేశారు. చామంతి, గులాబీలు, లిల్లీ పువ్వుల తోపాటు వివిధ రకాలు పుష్పాలతో స్వామి అభిషకం చేశారు. అనంతరం వేద ఆశీర్వాదం తీసుకొన్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ పర్సన్ ఇన్‌చార్జి పి.గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు ఆయనకు భారీ గజమాలతో సత్కరించారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న మండల సర్వేయర్ రూపావతి

కరప: భూసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్వేయర్ ఎస్.రూపావతి కోరారు. యండమూరులో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్నా దరఖాస్తు చేసుకుంటే సర్వే చేసి, పరిష్కరిస్తామన్నారు. సబ్‌డివిజన్, భూవిస్తీర్ణం తక్కువ, ఎక్కువ ఉన్నా, పాస్ పుస్తకాల్లో పేర్లు తప్పుగా నమోదైనా, మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి, సవరణలకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామసర్పంచ్ మార్నెళ్ల శివ, మాజీసర్పంచ్ పలివెల జానకి రామయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గా ప్రసాద్, వీఆర్వో పి.ఏసేబు పాల్గొన్నారు.

వీఓఏలకు న్యాయం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న సబ్బతి ఫణీశ్వరరావు

కాకినాడ సిటీ: బ్యాంకు అధికారుల కుట్రలకు బలైన బ్యాంకు ఆఫ్ బరోడా వీఓఏలకు న్యాయం చేయాలని టీఎస్‌టీయూసీ జిల్లా నాయకులు సబ్బతి ఫణీశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేవలం నామమాత్రపు గౌరవ వేతనం తీసుకుంటూ ఖాతాదారులను, గ్రామీణ ప్రజలకు రుణాలు మంజూరు చేయించే వీఓఏలు కేవలం బ్యాంకు అధికారులు చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునే నేపథ్యంలో వారిని విధుల నుంచి తప్పించినట్టు ఫణీశ్వరరావు విమర్శించారు. వీఓఏలకు జరిగిన అన్యాయంపై టీడీపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై లోకేష్ సానుకూలంగా స్పందించి కలెక్టర్ షణ్మోహన్‌కు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. మంత్రి లోకేష్ ఆదేశాలను సారం తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు.

అమాయకులే టార్గెట్

- పేట్రేగిపోతున్న సైబర్ మోసగాళ్లు
- రూ.లక్షల్లో దోపిడీ
- లబోదిబోమంటున్న బాధితులు
- కాపాడాలని కోరుతున్న ప్రజలు



కరప పోలీసు స్టేషన్

కరప: అమాయక ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా తీసుకుని సైబర్ మోసగాళ్లు రోజురోజుకూ పేట్రేగిపోతున్నారు. సైబర్ నేరగాళ్ల మోసాలు, బెదిరింపులతో చెలరేగి పోతున్నారు. అమాయక ప్రజలు, చిరుద్యోగులు నేరగాళ్ల మాయమాటలకు ఉచ్చులోపడి లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. బ్యాంక్ అకౌంట్లలో సొమ్ములు గల్లంతు అవుతుండడంతో ఆనక బాధితులు లబోదిబోమంటున్నారు. కొంతమంది జరిగిన మోసాన్ని బయటకు చెప్పుకోలేక లోలోపలనే మదన పడుతుంటే, మరికొంత మంది న్యాయం చేయాలని కోరతూ పోలీసులను ఆశ్రయించి, జరిగిన నష్టాన్ని, ఎలా మోసపోయింది వివరిస్తున్నారు. ఒక్కొక్కరిదీ ఒక్కో రకంగా ఉంటోంది. ఆన్‌లైన్ సంపాదన పేరిట, ఉద్యోగాల ఎరచూపించి, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారు డిజిటల్ అరెస్టు చేశామని, సీబీఐ నుంచి మాట్లాడుతున్నామని, ఇల్లీగల్ కార్యకలాపాలు సాగిస్తున్నారంటూ బెదిరింపు కాల్స్ వస్తుండడంతో నేరగాళ్ల వలలో చిక్కుకుని సొమ్ములు పోగొట్టుకుంటున్నారు. సైబర్ నేరాలకు పోలీసులు అడ్డుకట్ట వేయలేరా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ వందలాది మందికి సైబర్ నేరగాళ్ల నుంచి పదేపదే ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. గత ఆరు నెలల కాలంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో రూ.30 లక్షలు వరకూ పోగొట్టుకున్నారు. అనధికారికంగా అయితే రూ.కోటి పైమాటే అంటున్నారు. ఒక్క కరప మండలంలోనే సైబర్ మోసగాళ్లు దోచుకుంది రూ.50 లక్షల వరకు ఉండొచ్చు అంటున్నారు. ఏమీ తెలియని అమాయకులే కాదు, అన్నీ తెలిసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, చిరుద్యోగులు కూడా మోసపోతున్నారంటే సైబర్ నేరగాళ్ల పనితనం తెలుస్తోంది.

సైబర్ మోసాలు జరిగేది ఇలా:

పోలీసు యూనిఫారంతో ఉన్న వ్యక్తి ఫోన్ చేసి సీబీఐ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం అంటూ వీడియో కాల్ చేసి, సంభాషణ మొదలెడతారు. సదరు వ్యక్తి మీఅమ్మాయి లేదా మీ అబ్బాయి పేరు ఇదేనా, ఫోన్ నంబరు ఇదేనా అని అడుగుతారు. పేరు, మొబైల్ నంబరు కరెక్టుగానే చెపుతారు. దీంతో నిజం పోలీసులే మాట్లాడుతున్నారని ఇవతల వారికి భయం మొదలవుతుంది. మీ అమ్మాయి ఇల్లీగల్ కార్యకలాపాలు సాగుస్తుండడంతో అరెస్టు చేశాం, మీరే స్వయంగా మాట్లాడండి అని హిందీలో కానీ, ఇంగ్లీషు కానీ చెపుతారు. వెంటనే అమ్మాయి అయితే ఆడగొంతుకతో, అబ్బాయి అయితే మగ వారి గొంతుతో డాడీ అంటూ ఏడుపు వినపడుతుంది, వెంటనే ఫోన్‌లాక్కుని, అరెస్టు నుంచి బయటపడాలంటే రూ.8 లక్షలు ఇవ్వాలని బెదిరింపు స్వరం విన పడుతుంది. లేకపోతే జైలుకు పోతారంటారు. అంత ఇచ్చుకోలేమంటే బేరసారాలకు దిగుతారు. ఇలా తమ దగ్గర ఉన్న సొమ్మును బట్టి అమాయకులు పోగొట్టుకుంటున్నారు.

మండలంలో జరిగిన మోసాలు

ఇలాగే కరపలో మీ అమ్మాయిని అరెస్టు చేశామని ఒకరికి ఫోన్ చేశారు, అదే సమయంలో ఆ అమ్మాయి ఆకుటుంబ సభ్యులతో వేరే మొబైల్‌లో మాట్లాడుతుండడంతో వాళ్లకు అనుమానంవచ్చి ఫోన్‌కట్ చేశారు. ఆన్‌లైన్ మోసాలు ఇలా ఉంటాయి. అమెజాన్‌లో ఒకప్రాడక్ట్ కొనుగోలు చేస్తే ఆఫర్ ఉంది. ఇంత మనీ మీకు లాభం వస్తుందని చెపుతారు. రూ.వెయ్యితో కొనుగోలు చేస్తే మీ అకౌంట్‌లో రూ.200 వస్తుందంటారు. వెంటనే సదరుకొనుగోలుపై అకౌంట్‌లో సొమ్ములు జమవుతాయి. అలా రూ.10 వేలు, రూ.50 వేలు వరకు కొనుగోలు చేయనుంచి అకౌంట్‌లో కమీషన్ సొమ్ములు జమచేస్తారు. దీంతో ఊరకనే సొమ్ములు అకౌంట్‌లో పడుతుంటే ఆశ కలిగిన బాధితులు రూ.లక్ష, రూ.2 లక్షలు చెల్లిస్తారు. అంతే అవతలి వారి నుంచి ఫోన్‌కట్ అవుతుంది. తర్వాత బ్లాక్ చేసి, సొమ్ములు దోచేస్తారు. కరప గ్రామానికి చెందిన ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రూ.2.50 లక్షలు, సిరిపురం గ్రామానికి చెందిన ఒక నిరుద్యోగి రూ.3 లక్షలు పోగొట్టుకున్నారు. పోలీసుస్టేషన్ సెటప్‌లో యూనిఫాంతో ఉన్న వ్యక్తి ఫోన్ చేసి, మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు మావద్ద ఆధారాలు ఉన్నాయి. నిన్ను డిజిటల్ అరెస్టు చేశాం కదలకు, ఒక గదిలో ఎవరికీ చెప్పకుండా కూర్చో అంటారు. మీరు అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే సొమ్ములు చెల్లించాలని బెదిరించారు. గత నెలలో కరప గ్రామానికి చెందిన ప్రైవేటు కంపెనీ ఉద్యోగి రూ.25 వేలు ఇలాగే పోగొట్టుకున్నాడు. రెండు రోజుల క్రితం అయితే పెద కొత్తూరుకు చెందిన మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావుకు 79974 77053 నంబరు నుంచి గుంటూరు నుంచి ఫోన్ చేస్తున్నాం మీ గ్రామానికి చెందిన గొల్లపల్లి సుబ్రహ్మణ్యం ఆన్‌లైన్‌లో లోన్ తీసుకుని తిరిగి చెల్లించలేదు. అతనికి మీరు హామీ ఉన్నారు. సదరు లోన్ అమౌంట్ మీ బ్యాంక్ అకౌంట్ నుంచి ఉపసంహరిస్తామని బెదిరించారు. తాను ఎవరికీ హామీ లేనని, నా ఖాతా నుంచి సొమ్ములు పోకుండా చూడాలని ఈశ్వరరావు పోలీసులకు, బ్యాంక్‌కు అర్జీపెట్టారు. పోలీసులు స్పందించి సైబర్ నేరాలకు చెక్‌పెట్టి, పోగొట్టుకున్న సొమ్ములు రికవరీ చేయాలని మండల వాసులు కోరుకుంటున్నారు.



కరపలో ఒకరికి వచ్చిన వీడియో కాల్ స్క్రీన్ షాట్



సైబర్ నేరాలపై అవగాహన, రక్షణకు పోలీసుశాఖ ముద్రించిన కరపత్రం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు సైబర్ మోసగాళ్లపై అప్రమత్తంగా ఉంటూ, వారి బారిన పడకుండా జాగ్రత్త పడాలి. సైబర్ మోసాలు ఎలా జరుగుతాయి, మాయమాటలతో ఎలా దింపుతారో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. డిజిటల్ అరెస్టు అనేది చట్టంలో లేనేలేదు. అది ఒక రకమైన మోసం. అపరిచిత వ్యక్తులనుంచికానీ, విదేశీకోడ్ నంబర్ల నుంచి ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయకండి. అటువంటి నంబర్లను వెంటనే బ్లాక్ చేసుకోవాలి. సైబర్ మోసాలపై 1930 నంబర్‌కు ఫోన్ చేసి, నమోదు చేసుకోవాలి.

– తోట సునీత, ఎస్ఐ, కరప పోలీసు స్టేషన్

సామూహికంగా కాత్యాయని వ్రతాలు



కాత్యాయని అమ్మవారికి పూజ చేస్తున్న బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు



కాత్యాయని అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళలు, యువతులు

కాకినాడ రూరల్: బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మార్గశిర మాసంలో ధర్మవర్ధిని ట్రస్ట్ నిర్వహణలో సోమవారం కాకినాడలోని శ్రీమతి ఆకుండి లక్ష్మీస్మారక గోశాలలో ఆడపిల్లలు సామూహికంగా కాత్యాయని వ్రతాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 500 మంది ఈ వ్రతాన్ని ఆచరించారు. గోపికలు శ్రీకృష్ణుడి అనుగ్రహం పొందడానికి ఈ వ్రతం చేశారని చాగంటి తెలిపారు. అనంతరం కాత్యాయనీ వ్రత మాహాత్మ్యాన్ని వివరించారు. ఈ పూజా కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, భక్తులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

- కలెక్టర్ షణ్మోహన్ సగిలి
- కాకినాడలో క్రిస్మస్ వేడుక



వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, అనురాగాలు, ప్రజల మనుగడ, జీవన శైలిని మార్చాయని, ప్రజల కోసం ఆయన ప్రాణత్యాగం చేయడంతో ప్రపంచ దేశాలన్నీ ఆయనను అనుకరిస్తున్నాయని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రేమ, దయ, శాంతి గుణాలు అలవర్చుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. సోమవారం రాత్రి మైనార్టీ సంక్షేమ శాఖ, ఏపీ స్టేట్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన క్రిస్మస్ ఐటీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీస్తు జన్మదినం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీశాఖాధికారి సనీల్ కుమార్, పాస్టర్లు రెవరెండ్ శామ్యూల్ సాగర్, మోసా అబ్రహం, జోస ఫ్‌బెన్నీ, కె.సైమాన్‌పాల్ సింహాద్రి, వి.సుందర్, బిషప్ పి.రత్నబాబు, హెన్రీ, పి.ఇశాక్, వై.పాపారావు, పరిమి హైజాక్, వనమాడి సుందర్, మోజేస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి క్యాండిల్స్ వెలిగించారు.

విశ్రాంత హిందీ పండిట్ ప్రభావతి మృతి

కరప: గ్రామానికి చెందిన విశ్రాంత హిందీపండిట్ చాగంటి ప్రభావతి(78) సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆమె కాకినాడలోని అన్నవరం సత్యవతీదేవి మహిళా కళాశాలలో హిందీపండిట్‌గా పనిచేశారు. రిటైర్డు అయిన తర్వాత స్వగ్రామమైన కరపలోని సొంతింటిలోనే కుమారులతో ఉంటున్నారు. ప్రభావతికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమారుడు చాగంటి సూరిబాబు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ పాలక మండలి సభ్యుడిగా పనిచేశారు. వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, జిల్లా వీర్వోల సంఘం మాజీ అధ్యక్షుడు చాగంటి వెంకట్రావు తదితర గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

వినియోగదారుల రక్షణకే చట్టాలు



వినియోగదారుల ఫోరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాది శ్రీనివాసరావు తదితరులు

కాకినాడ రూరల్: వినియోగదారుల రక్షణ కోసమే చట్టాలను రూపొందించారని జిల్లా వినియోగదారుల రక్షణ సమితి కౌన్సిల్ సభ్యులు న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జిల్లా వినియోగదారుల సమాచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమాన్ని మెరుగుపరచడం, భద్రతతో పాటు ఆర్థిక ప్రయోజనాలను సమర్థవంతంగా పరిరక్షించడం ఈ చట్టాల లక్ష్యమన్నారు. మన దేశంలో 1986 నుంచి వినియోగదారుల రక్షణ చట్టం అమలులో ఉందన్నారు. ప్రతి జిల్లాలో వినియోగదారుల వివాద పరిష్కార ఫోరంలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ ఫోరంలలో చైర్మన్‌తో పాటు సభ్యులు ఉంటారని అన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వినియోగదారులు వారి హక్కుల రక్షణ కోసం వాటిని ఆశ్రయించి న్యాయం పొందవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా కేసులు నమోదు చేయవచ్చని అన్నారు. వాట్సాప్‌లో కూడా ఎక్కడి నుంచైనా కేసు నమోదు చేయవచ్చని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రాజా, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలని నిరసన



ఇళ్లు కట్టించి ఇవ్వాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

కాకినాడ సిటీ: అగ్ని ప్రమాదంలో దగ్ధమైన స్థలాల్లోనే పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరుతూ బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. 30 మంది బాధితులు పిల్లలతో కలెక్టరేట్‌కు చేరుకుని అక్కడ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలిపోయిన స్థలంలోనే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కాకినాడ 12వ డివిజన్ ఏఎంజీ స్కూల్ వెనుక నవంబర్ 29న తాటాకిళ్లు పూర్తిగా కాలిపోవడంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు మైలపల్లి సత్యవతి వివరించారు. ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో రెండోసారి ఫిర్యాదు చేశామన్నారు. జగనన్న లేఅవుట్‌ల్లో కొంత మందికి పట్టాలు ఇవ్వడం తప్ప స్థలాలు చూపించలేదన్నారు. నిరాశ్రయులైన తమందరికీ కాలిపోయిన చోటే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఓసుపల్లి మసేనమ్మ, అర్జుల జయమ్మ, పబ్బతి లలిత, మట్టా సత్యవతి, బొమ్మిడి పరదేశమ్మ, కారే లక్ష్మీదేవి, ఏరుపల్లి ధానమ్మ, మేరుగు అమ్మాజీ, మైని సత్తెమ్మ, ఏరుపల్లి మేరి, మేడ అప్పయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే ఓజోన్ పొరకు రక్షణ



ఎన్‌టీఆర్ బీచ్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

బాలాజీచెరువు: పర్యావరణ పరిరక్షణతో పాటు ఓజోన్ పొర సంరక్షణకు మొక్కలు నాటాలని ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు పేర్కొన్నారు. మహిళ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆల్‌ఈజ్‌వెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌టీఆర్ బీచ్‌లో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే.కరుణ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ బీచ్‌లో వెయ్యి కొబ్బరి మొక్కలు పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా తమ విద్యార్థులు భాగస్వాములవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కిషోర్‌కుమార్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖ,పీడీ సత్యవతిలు పాల్గొన్నారు.

ఊరూరా వేడుక.. క్రిస్మస్ పండగ!

- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చారిత్రక చర్చిలు
- విద్యుద్దీపాలతో అలంకరణ
- అన్ని ఏర్పాటు చేసుకున్న క్రైస్తవులు
- జిల్లా అంతటా క్రిస్మస్ శోభ

నాగమల్లితోటజంక్షన్ (కాకినాడసిటీ): క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమయ్యాయి. చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. మానవులు రక్షణార్థ ఈలోకానికి యోహోవా దేవుడు పంపిన వరపుత్రుడు యేసు అని బైబిల్ చెబుతోంది. మహాత్ముడు జన్మించాడనే సూచనగా ఆకాశంలో నక్షత్రం ఉదయించింది. దానికి గుర్తుగానే క్రైస్తవులు తమ ఇళ్ల వద్ద వెలుగు జిమ్మే స్టార్స్‌ను ఏర్పాటు చేసుకుంటారు. క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేసుకొని, విద్యుద్దీపాలతో ఇళ్లను అందంగా అలంకరించుకుంటారు. జిల్లాలో ఊరువాడా క్రిస్మస్ వేడుకలు జరుపుకోనేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళవారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమవుతాయి. క్రైస్తవులు ఈనెలంతా హాలీడేసీజన్, సీజన్ ఆఫ్ జాయ్‌గా, సీజన్ ఆఫ్ గివింగ్‌గా అభివర్ణిస్తూ భక్తితో, ఉత్సాహంగా జరుపుకొంటున్నారు.

కాకినాడ నగరంలో చారిత్రక చర్చిలు

జిల్లా కేంద్రమైన కాకినాడతోపాటు, పిఠాపురం సెంటినరీ బాప్టిస్టు చర్చి, గొల్లప్రోలు రోమన్ కేథలిక్ చర్చి, తుని బాప్టిస్టు చర్చి తదితర ప్రాంతాల్లో చర్చిలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. నగరంలోని పలు చర్చిలకు చారిత్రక ప్రసిద్ధి ఉంది. వందల సంవత్సరాల క్రితం కట్టిన చర్చిలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయంటే అతిశయోక్తికాదు. బ్రిటిష్ కాలం నాటి రాతి కట్టడాలను ప్రతిబింబిస్తూ జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రైస్తవ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. నగరంలోని జగన్నాథపురంలో ఒక సెంటర్‌కు చర్చి సెంటర్ అని పేరు. ఈ చర్చి సెంటర్‌లో వందల సంవత్సరాల నాటి చర్చిలు నాలుగు ఉండడంతో ఈ సెంటర్‌కు చర్చి సెంటర్ అని పేరు వచ్చింది



క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న కాకినాడ రిజర్వ్‌లైన్స్ బాప్టిస్టు చర్చి.

సీఎస్ఐ సెయింట్ థోమస్ చర్చి

జగన్నాథపురం చర్చి సెంటర్‌లోని సీఎస్ఐ సెయింట్ థోమస్ చర్చి 1780వ సంవత్సరంలో నిర్మించారు. కాకినాడ నగరంలో ఉన్న చారిత్రక చర్చిలో ఒకటిగా దాదాపు 240 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో క్రైస్తవ భక్తులకు ఆరాధన స్థలంగా ఉంది. ప్రతిఏడాది డిసెంబరు 25న క్రిస్మస్ పండగను ఘనంగా నిర్వహిస్తారు.

సెయింటాన్స్ చర్చి

జగన్నాథపురంలోని చర్చి సెంటర్‌లోని మరొక చర్చి సెయింటాన్స్ చర్చి. 1839 సంవత్సరంలో దీనిని నిర్మించారు. ఈ చర్చి నిర్మాణాన్ని ఫ్రెంచ్ మిషనరీల ఆధ్వర్యంలో జరిగింది. ప్యారీస్ ప్రీస్ట్‌గా బిషప్ టైసర్ ఉన్న కాలంలో దీని నిర్మించారు. ప్రతి ఏడాది డిసెంబరు 25న క్రిస్మస్ వేడులకు ఈచర్చి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.24వ తేదీ రాత్రి నుంచే క్రిస్మస్ ప్రత్యేక ఆరాధనలు, క్యాండిల్ సర్వీస్‌లు ఈ చర్చిలో ప్రారంభమవుతాయి. రాత్రంతా చర్చిలోనే గుడుపుతూ పాటలు పాడుతూ ఉంటారు.



కాకినాడ జగన్నాథపురంలో సీఎస్ఐ చర్చి

సెయింట్‌జాన్స్ లూథరన్ చర్చి

రామారావుపేటలోని సెయింట్‌జాన్స్ లూథరన్ చర్చి 1944లో నిర్మించారు. పాత ఆలయ స్థలంలోనే ఈ ఏడాది నూతన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి నగరంలోనే ఆకర్షణీయమైన చర్చిల్లో ఒకటిగా తీర్చిదిద్దారు. ఇక్కడ క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. వందలాది సంఖ్యలో క్రైస్తవ భక్తులు ఈ వేడుకల్లో పాల్గొంటారు.



క్రిస్మస్ సందర్భంగా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన శాంతాక్లాజ్ బొమ్మ

ఆంధ్రాబాప్టిస్టు చర్చి

గాంధీనగర్ ఎల్విన్‌పేట సుబ్బారావు వీధిలోని ఆంధ్రాబాప్టిస్టు చర్చి 1924లో నిర్మించారు. చారిత్రక చర్చిలో ఒకటిగా ఆ ప్రాంతంలో ప్రసిద్ధిచెందింది. క్రీస్తు జన్మదిన వేడుకలు ప్రతి ఏడాది డిసెంబరు వైభవంగా నిర్వహిస్తారు.



కాకినాడ రామారావుపేటలో నిర్వహించిన కిష్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



కాకినాడ జగన్నాథపురంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి

రేపటి నుంచి సీతారామస్వామి ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో బుధవారం నుంచి స్వామివారి రజిత దశావతార అలంకార ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు సోమవారం విలేకర్లకు తెలిపారు. ఈ నెల 25న మత్స్యవతారం, 26న కూర్మావతారం, 27న నరసింహావతారం, 28న వరహావతారం, 29న వామనావతారం, 30న పరశురామవతారం, 31న రామావతారం, జనవర ఒకటిన బలరామవతారం, 2న కృష్ణావతారం, 3న బుద్ధావతారం, 4న కల్కి అవతారం, 5న వేంకటేశ్వరస్వామి, 6న శేషశయన, 7న లక్ష్మీహయగ్రీవ, 8న ధన్వంతరి, 9న జగన్మోహిని అవతారం, 10న మహావిష్ణు, 11న దత్తాత్రేయ, 12న విశ్వరూప సందర్శన అవతారంలో స్వామివారు భక్తులు దర్శనమివ్వనున్నారని తెలిపారు. ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా జనవరి 10న ముక్కోటి ఏకాదశి వైభవంగా జరుగుతుందన్నారు. అలాగే బేడా ఉత్సవం, 12న గోదా అమ్మవారికి నీరాట్ట ఉత్సవం, 13న గోదా కల్యాణం వైభవంగా నిర్వహించనునట్టు తెలిపారు.

ఆన్‌లైన్‌లో ప్రావిజినల్ మెరిట్ లిస్టు

కాకినాడ క్రైం: ఈ ఏడాది జనవరి 21వ తేదీన విడుదల చేసిన పారామెడికల్ ఉద్యోగ నోటిఫికేషన్‌కు సంబంధించి రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఓ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఎస్‌బీసీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల ప్రావిజినల్ మెరిట్ లిస్ట్ అప్‌లోడ్ చేసినట్టు తెలిపారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఇచ్చారు. అభ్యంతరాలను ఆర్ఎంసీలోనే స్వీకరిస్తామని తెలిపారు.